# ఆత్మకు సంబంధించిన ధర్మమే స్వధర్మము

**కర్మవలన జన్మ కలుగుచునుండు**
**కర్మలందు సుఖము కలుగుచుండు**
**కర్మవలన మేలుకీడు కలిగె ప్రపంచమందు**
**సుఖము దుఃఖము యిలను సుస్థిరములు**

sri sathyasaivachanamrutam

దివ్యాత్మ స్వరూపులారా!

'కర్మానుబంధీని మనుష్యలోకే'. జగత్తు బ్రహ్మమయము. బ్రహ్మమయమైన జగత్తు కర్మమయము. సృష్టియే ఒక పెద్ద కర్మ. మానవుడు సృష్టితో కూడినవాడు కనుక, మానవుడే కర్మ. మానవుడనగా జీవశక్తి. జీవశక్తియొక్క ఉపాధియే శరీరము. ఆ శరీరమే కర్మమయము. కర్మానుసారముగనే దేహములు ప్రాప్తించుచున్నవి. కనుక మానవత్వమునకు, సమస్త సృష్టికిని కర్మయే ఆధారము. కర్మయే మూలము. ఈ కర్మయొక్క తత్త్వాన్ని గుర్తించుకొనుటకై కర్మలాచరించాలి. కర్మలాచరించుటకు మనము కర్మలను అర్థము చేసుకోవాలి.

## ఫలాపేక్షలేని కర్మలు ఆచరించటమే మానవుని ప్రధాన కర్తవ్యము

మనో వాక్కాయములు చేసే పనులకే కర్మ అని పేరు. కర్మాచరణకు ఐదు సూత్రములు-మొదటిది శరీరము, రెండవది కర్త, మూడవది వివిధ అంగములు, నాల్గవది వేరు వేరు పనులు, ఐదవదే అన్నింటిలోనూ వుండిన ప్రాణతత్త్వమైన దైవత్వము. దివ్యత్వముచేతనే సమస్తముకూడను జరుగుతున్నది. కాని మానవులు యిట్టి దివ్యత్వమును గుర్తించుకొనలేక కేవలము అంగములను, ఉపాంగములను ఆధారము చేసుకొని కర్తవ్యాన్ని

నిర్వర్తించుకొనక కర్మఫలాన్ని ఆశించి కర్మలను సలుపుతున్నారు. ప్రతిఫలాపేక్షచే కర్మలాచరించుచున్నారు, మానవులు. ఈ కర్మఫలమును అనుభవించుటకై మానవుడు తిరిగి జన్మనెత్తుచున్నాడు. కారణమేమనగా కర్మఫల నిమిత్తమై తాను కర్మలాచరించటముచేత కర్మఫలము అనుభవించటానికి తిరిగి మానవ జన్మ యెత్తవలసి వస్తుంది. కనుకనే ఫలాపేక్షలేని కర్మలు ఆచరించటమే ప్రధాన కర్తవ్యమని గుర్తించాలి. ఇందులో రెండు విధములైన కర్మలు వుంటున్నవి. వీనినే ధర్మములని బోధిస్తూ వచ్చింది, భగవద్గీత. స్వధర్మ, పరధర్మ అని. స్వధర్మమనగా ఈనాడు కేవలము జాతిమతకుల వర్ణములకు సంబంధించినదిగా భావిస్తున్నారు. ఈ స్వధర్మమే శ్రేయస్సనికూడ విశ్వసిస్తున్నారు. యిది శ్రేయస్సే అయినప్పటికి తాము తలంచినట్టుగా జాతిమతకులములకు సంబంధించినదికాదు. 'స్వ' అనగా ఆత్మ. ఆత్మకు సంబంధించిన ధర్మమే స్వధర్మము. ఇది మారునది కాని, యింకేవిధమైన రూపములు దరించునదికాని కాదు. ఇది నిర్గుణ నిరంజనములచే కూడినది. ఇది నిత్యసత్యమైనది. ఇది ఆత్మకు సంబంధించినది. కనుకనే ఆత్మసంబంధమైన ధర్మమునే మానవులు ఆచరించాలని, యిదియే శ్రేయస్సనికూడను గుర్తించాలి. పరధర్మమనగా కేవలము దేహమునకు సంబంధించినది. ఇది రాగద్వేషములతోకూడినది. అహంకార, మమకారములతో కూడినది. కనుకనే యిది చాలా ప్రమాదమైనది. కనుకనే స్వధర్మమనేది శ్రేయస్సని, పరధర్మము ప్రమాధకరమైనదని నిర్ణయించింది భగవద్గీత. అనగా దేహధర్మము ననుసరించి కర్మలు చేసినప్పుడు ఏనాటికైనా ఫలప్రాప్తిని అనుభవించే నిమిత్తమై తిరిగి యీ దేహము ధరించవలసివస్తుంది. దేహముతో ఆచరించే సర్వ కర్మలుకూడను ఫలప్రాప్తి నిమిత్తమై ఆచరిస్తున్నారు. కనుక, యిది ప్రమాదమైనదిగాకూడను మనము విశ్వసించాలి. కర్మలు ఆచరించు సమయములందు మనకు యేమాత్రము అర్థము కాదు. ముందు రాబోయే పరిణామములను యేమాత్రము మనము గుర్తించుకోలేక పోతున్నాము. బోనులో వుండిన పుల్లిపాయ వాసనకై పురుకులెత్తే ఎలుకలవలె ముందు యేమిజరుగునో, యేమవుతుందో, యేమివున్నదో అనే విషయాన్ని మనము విస్మరిస్తున్నాము.

**సర్వకర్మ భగవత్ ప్రీత్యర్థమనే భావముతో ఆచరించే కర్మలే సత్కర్మలు**

తాత్కాలిక విషయ సంపదల నిమిత్తమై ఆచరించే కర్మలన్నియుకూడను మున్ముందు ఒక బంధహేతువుగా వుంటున్నవి. అందువలన జన్మను సార్థకము చేసుకొనే నిమిత్తమై మనము సత్కర్మలను ఆచరించటానికి ప్రయత్నించాలి. ఇందులోకూడను మూడురకములైన కర్మలు వుంటున్నవి. ఈ మూడుకూడను గుణములతోకూడినవి–సాత్త్విక కర్మ, రాజసిక కర్మ, తామసిక కర్మ అని. అహంకార, మమకారములకు సంబంధములేక, ఫలమును ఆశించక, సర్వకర్మ భగవత్ ప్రీత్యర్థమై ఆచరించే కర్మలు, సత్కర్మలు. ఇవి కేవలము దైవాన్ని తృప్తిపరచే నిమిత్తము, దైవాన్ని ప్రసన్నుని గావించుకొనే నిమిత్తము, దైవప్రీతిని అనుభవింపగోరి ఆచరించే సద్గుణములతోకూడిన కర్మలు. అహంకార మమకారములతో, ఫలాపేక్షతో చేయు కర్మలన్నియుకూడను రాజసిక కర్మలు. ఇవి కేవలము సామాన్యమైన మానవులు యీ జగత్తునందు నిత్యము ఆచరించే కర్మలయొక్క గుర్తులు. ఈ పృధ్విపై ప్రతి మానవుడుకూడను యీ రాజసిక సంబంధమైన కర్మలనే అధికముగా అనుభవిస్తున్నాడు. వీటిని సాత్త్వికముగా మార్చుకొనుటకు ప్రయత్నించాలి. మూడవది తామసికకర్మ. ఇది కేవలము స్వార్థ, స్వప్రయోజనముల నిమిత్తమై ఆచరింపబడుతూ పరులను హింసించటము, పరులను బాధించటము, పరపీడన చేయటము యిలాంటి కృత్యములతోకూడినది. ప్రాణహింసతోకూడినది. భూతదయారహితమైనది. ఇది సంకుచితమైన భావములతోకూడినది. పూర్తి స్వార్థమైనది. ఈ తామసికము చాలా ప్రమాదకరమైనది.

**కర్మసాధనకు శరీరమే మూలాధారము**

మానవుడు తెలిసో తెలియకో నిత్యజీవితములో అనేక కర్మలు ఆచరిస్తూవుంటాడు. ఈకర్మలయొక్క పరిహార నిమిత్తమై ఐదు విధములైన యజ్ఞములు నియమించారు. ఒకటి దేవ యజ్ఞము. రెండవది పితృయజ్ఞము, మూడవది భూత యజ్ఞము, నాల్గవది మనుష్య యజ్ఞము, ఐదవది ఋషి యజ్ఞము. దీనినే బ్రహ్మ యజ్ఞమనికూడను భావిస్తూ వుంటారు. ఈ ఐదు యజ్ఞములయొక్క అంతరార్థములను మనము గుర్తించటానికి ప్రయత్నించాలి.

మానవుడు నిత్యజీవితములో తాను ఆచరించే కర్మలయందు అనేక ప్రాణులు

srisathyasaivahini.in

మరణిస్తున్నవి. మనకు తెలియకుండగనే రుబ్బుటలో, దంచుటలో, నూరుటలో అనేక ప్రాణుల ప్రాణములు పోవుచున్నవి. ఇవి మనము తెలిసి చేసే పాపములుకాదు. మనకు తెలియకుండానే యెన్నియో జీవులు నశించుచున్నవి. కనుక, యిట్టి పాపములయొక్క పరిహార నిమిత్తమై దేవ యజ్ఞమని నిర్ణయించారు. ఇంతే కాక, మన దేహములోని ప్రతి అంగమునందు రసస్వరూపులై దేవతలు నివసించుచున్నారు. అందువలననే అంగీరసులు అని వీరికి పేరు. కనుక రసస్వరూపులై మన అంగములను పోషించుచూ రక్షించుచూ వుండటంచేతనే కృతజ్ఞతా పూర్వకముగా వారిని స్మరించటము, చింతించటము, ధ్యానించటము, స్వాధ్యాయము సల్పటము యిలాంటి కార్యములందు పాల్గొనడం మన నిజమైన కర్తవ్యము. నిద్రావస్థయందు, సుషుప్తియందు, ఇంకా మనకు తెలియని సమయములందు యీ దేహమును ఆ దేవతలే రక్షిస్తూవుంటారు. ఈ పవిత్రమైన దేహము కర్మాచరణ నిమిత్తమై వచ్చినదనే సత్యాన్ని గుర్తించే వ్యక్తులు యీ కాయమును పోషించే దేవతలకు కృతజ్ఞత తెల్పటము తమ కర్తవ్యముగా భావిస్తారు. 'శరీర మాద్యం ఖలు ధర్మసాధనం' అని సూక్తి. ఈ యొక్క కర్మసాధనకు శరీరమే మూలాధారము. కనుకనే యీ అంగదేవతలైన వీరికి మనము కృతజ్ఞతా పూర్వకముగా స్మరిస్తూ, భజిస్తూ, ధ్యానిస్తూ, చింతిస్తూ వారికి తమ కృతజ్ఞత తెలుపుకోటమే దేవయజ్ఞమని పిలుస్తూ వచ్చారు. దీనితోపాటు మనము తెలియక చేసిన పాపములను, తెలియక జీవులను హింసించిన పాపములను కొంతవరకు పరిహారము చేసుకునే నిమిత్తమై యీయొక్క యజ్ఞమును చేయవలెనని విశ్వసించాలి.

ఇంక పితృ యజ్ఞము. ఈ పితృ యజ్ఞముయొక్క అంతరార్థమునుకూడా మనము విచారించాలి. కట్టెలు కొట్టునప్పుడు, కొమ్మలు విరుచునపుడు, పువ్వులు కోయునప్పుడు యెన్నో ప్రాణులు మరణించుచున్నవి. యీ కర్మలు ఆచరించే సమయములో కొన్ని ప్రాణులు మరణించటముచేత దానికి కారణము తానే అని గుర్తించుకొని యీ పాప పరిహారార్థమై పితృ యజ్ఞము గావించాలనే మార్గమును అవలంబిస్తూ రావాలి. ఇంతేకాక యీ దేహమునకు మూలకారకులు తల్లితండ్రులు. మన రక్తము, మన ఆహారము, మనయొక్క మెదడు, మనయొక్క తెలివితేటలు యివన్నికూడను తల్లి తండ్రులయొక్క ప్రసాదములే!



srisathyasaivahini.org

పవిత్రమైన యీ మానవ జన్మమును అనుగ్రహించి ప్రసాదించిన తల్లి తండ్రులకు మనము యెంతయో ఋణపడి వుంటున్నాము. అందువలన వారిని ప్రసన్నులను గావించికొని సంతృప్తి పరచే కర్మలు ఆచరించాలి. వారు మరణించిన తరువాత వారి జ్ఞాపకార్థమై యేర్పడినవే యీ శ్రాద్ధములు. ఇట్టి శ్రాద్ధకర్మలచేత పితృదేవతలను సంతృప్తిపరచి వారిని ప్రసన్నులను గావించుకోవాలి. ఈ కారణ నిమిత్తమైకూడను పితృయజ్ఞము యేర్పడుతూ వచ్చింది.

భూతయజ్ఞము. మనము స్నానము చేయునప్పుడు, యిల్లు ఊడ్చునప్పుడు, బట్టలు వుతుకునప్పుడు యెన్నియో ప్రాణులు మరణించుచున్నవి. దీని పరిహారార్థమై మనము యీ విధమైన భూత యజ్ఞము అనగా భూతప్రీతికి తగిన ప్రయత్నము చేయాలి. ఇది ప్రాచీనకాలమునుండికూడను ఋషులదగ్గరనుండి ప్రారంభమైనది. ఋషుల ఆశ్రమములో సాత్త్విక స్వరూపులైన జింకలను, నెమళ్ళను పెంచుకొనటము, గోవులను పెంచుకోవటము జరుగుతూ ఉండేది. తమ స్వార్థము, పరార్థములు రెండింటి నిమిత్తమై వారు యీ భూత గణములను ప్రేమిస్తూ వచ్చారు. మన ప్రాచీన సంస్కృతిని పురస్కరించుకొని ఆనాటి వ్యక్తులందరుకూడను యెక్కడైనా చీమల పుట్టచూస్తే అక్కడ భూతప్రీతి నిమిత్తమై చక్కెర వేయటమో లేక బియ్యపుపిండి పెట్టటమో యిలాంటి కర్మలాచరిస్తూ వచ్చారు. భుజించిన తరువాత మనయొక్క విస్తరియందు యేకొంత మెతుకులైనా వుంటుంటే దానిని బయట పారవేసినప్పుడు ఏకాకులో, ఏ పక్షులో, ఏకుక్కలో వచ్చి భుజిస్తే అదికూడను భూత తృప్తిని కలిగించే మార్గమని విశ్వసించారు. ఈనాటికికూడను అనేకమంది గృహములందు గోవులు, కుక్కలు, పక్షులు యిత్యాది చిన్నచిన్న జీవులంతా పెంచుకొని వాటిని తృప్తిపరుస్తూ వస్తున్నారు. ఈ విధంగా భూతప్రీతిని కలిగించటము మనము తెలియక చేసిన దోషముల పరిహారార్థమే!

ఇంక మానవ యజ్ఞము-మనుష్య యజ్ఞమంటారు. మనము పొయ్యి రగిలించే సమయమునందు, కూరగాయలు తరిగే సమయమందు, దారిలో నడచే సమయమందు అనేక ప్రాణులు నశిస్తూ వున్నాయి. యీ మరణించిన ప్రాణులయొక్క పరిహార నిమిత్తము,

పాప పరిహార నిమిత్తము గావించే కర్మలను యజ్ఞములుగా భావిస్తూ వచ్చారు, ఆనాటి మహనీయులు.

కడపటిది ఋషి యజ్ఞము. దీనినే 'బ్రహ్మ యజ్ఞము' అంటారు. 'జంతూనాం నరజన్మ దుర్లభం'. మానవ జన్మము చాలా దుర్లభమైనది. ఇది కేవలము జన్మాంతర సుకృతముచేతను, భగవత్ కృపా కటాక్షముచేతను యేర్పడినదేగాని మనుష్య ప్రయత్నముతో లభించినదిగాదు. ఇట్టి అరుదైన మానవ జన్మమును సరైన మార్గమునందు ప్రవేశపెట్టి తమ గమ్యమును చేర్చే నిమిత్తమై ఆనాటి ఋషులు అనేక శాస్త్రములను, ఉపనిషత్తులను, యితిహాసములను, నియమములను, నిబంధనలనుకూడను యేర్పరచి మానవునకు ఒక చక్కటి మార్గాన్ని చూపించారు. ధర్మార్థ కామ మోక్షములనే చతుర్విధ పురుషార్థములుకూడను వారే నియమించారు. మానవునియొక్క నిత్యజీవితము సత్యమార్గములో ప్రవేశపెట్టే నిమిత్తమై యీ విధమైన ఆశయాలను వారు కల్పించారు. ఏ పశుపక్ష్యాది మృగములకు లేని నిబంధనలను మానవునకు నియమించారు. కారణమేమనగా మానవుడు విచక్షణా జ్ఞానము కలిగినవాడు కనుక, నిత్యానిత్యవిషయ పరిశీలనాశక్తి కలిగినవాడు కనుక, యిలాంటి మార్గమును అవలంభించటము అత్యవసరము. ఈ పాపములుకూడను మానవునికే వున్నవిగాని మిగిలిన పశుపక్షిమృగాదులకు యేమాత్రముకూడను లేవు. శాసనములుకూడను మానవులకే నియమించినారు కాని పశుపక్షిమృగాదులకు నియమించలేదు. శాపములుకూడను మానవుల నిమిత్తమై యేర్పడినవేగాని పశుపక్షిమృగాదుల నిమిత్తమై ఏర్పడినవి కాదు. పాపము, శాస్త్రము, శాసనము, శాపము యీ నాలుగుకూడను ఒక్క మానవునకు మాత్రమే! యిట్టి పవిత్రమైన మార్గమున నడచి, మానవ జన్మము పవిత్రము గావించుకోమని మహర్షులు అనేక విధములుగా బోధిస్తూ తమ ఆచరణద్వారా నిరూపిస్తూ వచ్చారు. వారు చూపించిన యీ మార్గమునకు మనము కృతజ్ఞతాపూర్వకముగా వారిని చింతించి, స్మరించి, ధ్యానించి వారి ఆశయములను నెరవేర్చుటమే మన ప్రధానమైన కర్తవ్యము. దీనితోపాటు మానవుడు పంటను పండించే నిమిత్తము భూమిని దున్నుతున్నాడు. దుక్కి చేయుచున్నాడు. పంటలు పండిస్తున్నాడు. కలుపులు, కోతలు చేస్తున్నాడు. ఇట్టి పరిస్థితులలో అనేక

sri sathyasai vahini vachanamrutam

విధములైన ప్రాణులు నశిస్తున్నాయి. యీ పాప పరిహార నిమిత్తము ఋషి యజ్ఞము ఆచరించమని చెప్పారు. ఈ విధంగా మానవుడు తెలిసో, తెలియకో యెన్నో ప్రాణులను నశింపచేస్తున్నాడు. ఈ జగత్తునందు అహింసా తత్త్వమును బోధించి, ఆచరించే వ్యక్తులు ఒక్కరుకూడను కనుపించటంలేదు. నిజానికి, అహింసా తత్త్వమును బోధించే అధికారముకూడను యెవ్వరికి లేదు. కారణం, మానవునికి తెలియకుండా యెన్నో విధములైన ప్రాణులు హింసించబడుతున్నాయి. మనము నిత్యము అనుభవించే ఉచ్ఛ్వాస, నిశ్వాసములందు కూడను అనేక క్రిమికీటకాదులు నశిస్తున్నాయి. మనము ఆచరించే ప్రాణాయామ, ప్రత్యాహారములందు అనేక విధములైన క్రిమికీటకాదులు మరణిస్తున్నాయి. మనము అచరించే ధ్యాన, తపస్సులందు అనేక క్రిమికీటకాదులు నశిస్తున్నాయి. ఇంక 'అహింస' అనే దానికి ఎక్కడ స్థానమున్నది? క్షణక్షణముకూడను మనము హింసలతోనే కూడివుంటున్నాము. హింసలనే చేస్తున్నాము. అయితే మనము తెలిసి చేయకూడదు, పాపము. తెలిసి ఒకరిని హింసించకూడదు. తెలిసి ఒక ప్రాణిని బాధించకూడదు. తెలియక చేసే విషయాలెన్నో వుండవచ్చును. తెలియక చేసినవి పాపములు కాదు. ఇవి పొరపాట్లు అని చెప్పవచ్చును. వీటిని క్షమించటానికి అవకాశము వుంటున్నది. తెలిసి చేసే పాపములకు యేమాత్రము పరిహారములేదు. ఇది తప్పక అనుభవించే తీరవలెను. మానవునియొక్క కర్మాచరణయందు తాము చేసిన కర్మల ఫలితముగా అనేక విధములైన బాధలను అనుభవిస్తూ వుంటారు. ఎట్టి విత్తనమును మనము నాటుకుందుమో అట్టిమొక్కనే, అట్టి వృక్షముగానే, అట్టి ఫలములుగానే మనకు లభిస్తాయి. కేవలము మనయొక్క అహంకార, అభిమానములచేత అనేక కార్యములు సలిపినట్టుగా మనము భ్రమిస్తున్నాము. ఇది కేవలము అజ్ఞానమే!

**ఇది చేతు అది చేతు ఇంకెన్నియో చేతు**
**ననుచు ఊహలు అల్లి అలసిపోకు**
**ఏ విత్తులను నాటి యిచ్చోట నుంటిరో**
**ఆ ఫలమ్ములె మీకు అందుచుండు**
**విత్తన మొకటైన వేరైన ఫలములు**

సంభవించుట ఎట్లు సాధ్యమగును?

కనుకనే త్రిమూర్తి ఆరాధన చేసి, త్రికాలములయందు మనము చేసిన పాపములను పరిహారము గావించుకునే నిమిత్తమై ప్రాతఃసంధ్య, మధ్యాహ్నసంధ్య, సాయంసంధ్య మరియు ప్రాతః పూజ, మధ్యాహ్న పూజ, సాయంపూజ అనేవి యేర్పడుతూ వచ్చాయి. సూర్యుడు ప్రాతఃకాలమున బ్రహ్మస్వరూపుడు, మధ్యాహ్నసమయమునందు ఈశ్వరస్వరూపుడు మరియు సాయంకాల సమయమునందు విష్ణుస్వరూపుడు. కనుక సూర్యుని ఆరాధన త్రిసంధ్యలందు గావించిన, అది త్రిమూర్తులయొక్క ఆరాధనగా రూపొందుతుంది. యిట్టి సత్యాన్ని గుర్తించి వర్తించే వ్యక్తులు అరుదుగా వుంటుంటారు. మనము మనకు తెలియకనే అనేక పాప కర్మలు ఆచరిస్తున్నాము. వాటి కర్మపరిహారము నిమిత్తమై యీ రకములైన ఐదు యజ్ఞములుకూడను నిత్యము మనము గావించాలి. ఈ యజ్ఞములకు హోమగుండములుగానీ, యింకే విధములైన వేదికలుగాని మనము యేర్పరుచుకోనక్కరలేదు. తల్లి తండ్రుల ఆజ్ఞను శిరసావహించి, దేవతలను చింతించి మన యింటియందు లేక బయట వుంటున్న ఆ ప్రాణులకు కొంత ఆహారమునందించి లేక ఒక భిక్షగాడికి పట్టెడన్నము పెట్టి, మానవ జన్మను సార్థకము చేసుకోవటానికి, పోషించుకోటానికి తగిన కృషి చేయటమే యీ ఐదు యజ్ఞములయొక్క సారము. కనుకనే

**అన్నదానముకంటె అధిక దానంబేది**
**తల్లి తండ్రులకన్న దైవమేది**
**జప తపంబులకన్న సత్యశీలంబేది**
**దయకంటె ఎక్కువ ధర్మమేది**
**సుజన సంగతికన్న చూడ లాభంబేది**
**క్రోధంబుకన్న శతృత్వమేది**
**ఋణముకంటెను నరులకు రోగమేది**
**ధరణి నపకీర్తికంటెను మరణమేది**
**సర్వదా కీర్తికంటెను సంపదేది**

srisathyasaivachanamrutam

**స్మరణకంటెను మించు ఆభరణమేది?**

**హృదయము పవిత్రముగా లేనప్పుడు కర్మలు ఆచరించి ప్రయోజనములేదు**

మానవజీవితమనేది చాలా వుత్కృష్టమైనది, శ్రేష్టమైనది. ఇట్టి శ్రేష్టమైన మానవ జీవితమును పవిత్రమార్గములో ప్రవేశపెట్టుటయే మనయొక్క ప్రధాన కర్తవ్యము. కేవలము పైపైన మంత్రములను ఉచ్చారణ చేయుటచే మనము యిట్టి పాపములను పరిహారము గావించుకొందమన్న యిది కేవలము వెఱ్ఱితనము. మంత్రములచేత పాపము పరిహారముకాదు. కర్మలచేతనే కొంతవరకునైనా పరిహారము గావించుకోవచ్చు. కనుకనే కర్తవ్యకర్మలను నిర్వర్తించటానికి తగిన శక్తిసామర్థ్యములు మీరు సంపాదించుకోవాలి. నిత్యజీవితములో సత్యానందమును మనము అనుభవించాలి. మనము యీనాడు అనుభవించే ఆనందము కేవలము లౌకికానందము. ఇవన్నీ క్షుద్రమైన ఆనందములు. క్షణికమైన ఆనందములు. అనిత్యమైన ఆనందములు. అసత్యమైన ఆనందములు. ఈ అనందములచేత మన హృదయము యేమాత్రముకూడను పరిశుద్ధముగానేరదు. కనుకనే

**చిత్తశుద్ధి లేని శివపూజ లేటికి**
**ఆత్మశుద్ధి లేని ఆచారమదియేల**
**పాత్ర శుద్ధిలేని పాక మేల**

అన్నారు. నీ హృదయము పరిశుద్ధముగా లేనప్పుడు, నీవు యెన్ని కర్మలు ఆచరించి ప్రయోజనమేమిటి? అసలు కర్మలు ఆచరించటమే చిత్తశుద్ధి నిమిత్తము! అటువంటప్పుడు పాప కర్మలద్వారా చిత్తమును మరింత మలినము గావించుకోటము మరింత అజ్ఞానము.

**నిరంతరము శాంతితో, ప్రేమతో, సత్యముతో జీవించుటకు ప్రయత్నించాలి**

యీనాడు అనేకవిధములైన వేదాంత గ్రంథములు పఠించవచ్చు, బోధించవచ్చు. కానీ ఆచరించటము చాలా కష్టము. అయితే ఆచరణనే మనము ప్రధానమైన లక్ష్యములో వుంచుకోవాలి. కష్టమునందే మనకు సుఖమున్నదిగానీ, సుఖమునందు సుఖములేదు. నిత్యజీవితములో యేవిధమైన వేదశాస్త్ర యితిహాస పురాణములు అధ్యయనం చెయ్యక పోయినా మనకు తెలిసినంతవరకు భూతదయ, పశ్చాత్తాపము మన హృదయములో

sri sathyasai vachanamrutam

అభివృద్ధిపరచుకోవాలి. చేయకలిగిన శక్తివుండికూడను దానధర్మము చేయకపోవటం మూర్ఖత్వము. యెన్ని మంత్రములు ఉచ్ఛరించినప్పటికిని ప్రయోజనములేదు. శక్తిమేరకు మనము దాన, ధర్మములు చెయ్యాలి. ధనమునకుకూడను నలుగురు వారసులుంటున్నారు. మొట్టమొదటివాడు, పెద్దకుమారుడు ధర్మము. ఈ ధర్మముకొరకే ధనమును ఖర్చుచేసి సద్వినియోగము గావించాలి. ఇంక రెండవవాడు రాజు, అనగా ప్రభుత్వము. దాన ధర్మములు చేయక కూడబెట్టిన ధనమును ఏదో ఒక సాకుపైన, లేదా ఒక రైడ్ జరిపించో, లేక యింకే విధమైన సుంకమని చెప్పో ప్రభుత్వము మనవద్దనుండి గుంజుకోటానికి ప్రయత్నిస్తారు. వారు గుంజుకున్న తరువాత మిగిలిన దానిని యే దొంగలో ప్రవేశించి అపహరిస్తారు. ఇంకా మిగిలినది యేమైనా వుంటుంటే అగ్ని ప్రవేశించి భస్మము చేస్తుంది. కనుక జీవితమున్నంతలోపలనే మనము తగిన దాన ధర్మాలు చేసి జీవితాన్ని సార్థకము గావించుకోవాలి. తెలిసి చెయ్యాలిగానీ చచ్చిన తరువాత ఏమి చేయటానికి వీలవుతుంది? చాలామంది విల్లు రాస్తుంటారు, ఫలాని ధర్మం అని. ఏమిటి లాభం? నీవు చచ్చిన తరువాత అదికూడ చచ్చింది. నీవు బ్రతికి ఉండినప్పుడే నీ హస్తములతో దానధర్మములు చేసి ఆనందమును అనుభవించు. ప్రతి ఒక్కటికూడను మనము తెలిసి చెయ్యాలి. 'చూచి త్రొక్కు, తెలిసిమొక్కు' అన్నారు. కనుకనే పరమభక్తుడైన త్యాగరాజుకూడను 'తెలిసి రామచింతన చేయవే' అన్నాడు. 'నీవు తెలిసి భగవంతుని చింత చేయి మనసా! తెలియకుండా అజ్ఞాన దృష్టితో నీవు భగవంతుని స్మరించటానికి ప్రయత్నించవద్దు. భగవంతుడు సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు, సర్వశక్తిమయుడు అనే విషయాన్ని గుర్తించుకొని నీ కర్తవ్యాన్ని నెరవేర్చటానికి ప్రయత్నించు', అన్నాడు. కాని, యీనాటి భక్తులు భగవంతుడు సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు, సర్వశక్తిమయుడు అని చక్కగా మాటలతో వర్ణిస్తారు గాని, ఆచరణలో మాత్రము ఆ భావము కనపడదు. ఈనాటి మన విశ్వాసములన్నియుకూడను పూజారూమువరకే పరిమితమై వుంటున్నాయి. పూజరూములో వుండినంతవరకు పరమశాంతిగా వుంటారు. భగవంతుని చాలా ప్రార్థిస్తూ వుంటారు. ఆ గది దాటి యివతలకు అడుగుపెట్టెనా యిక పనివారిపైన, వీరిపైన, వారిపైన అనేక రకములైన ఉద్రేకములు బయలుదేరుతుంటాయి. ఇది కాదు, మన నిజమైన యోగము. ఇది కాదు,

srisathyasaivachanamrutam

మన నిజమైన ధ్యానము. ఇది కాదు, మన నిజమైన భక్తి. 'సతతం యోగినః'. నిరంతరము శాంతితో, ప్రేమతో, సత్యముతో జీవించటానికి ప్రయత్నించాలి.

**ఈనాడు భక్తుడు భగవంతుని వెతకటంలేదు, భగవంతుడే సరైన భక్తుడెక్కడ ఉన్నాడని వెతుకుతున్నాడు!**

భగవంతునిముందు అనేక భరతనాట్యాలాడుతూ వుంటారు. ఈ వినయ విధేయతలు కేవలము ఆషాడభూతి వేషాలుగా కన్పిస్తుంటాయి. కొంచెం ప్రక్కకు వెడితే యింక సాక్షాత్తు దుర్వాసులుగానో మరే విధముగానో మారిపోతారు. ఈ విధముగా మారటమనేది యేమాత్రముకూడను మంచిదికాదు. సమయమును పురస్కరించుకొని కొన్ని పదములు మార్చుకొనవచ్చును. కాని, హృదయాన్ని మాత్రం మార్చుకోరాదు. ఇలాంటివారి హృదయము కేవలము ఒక రాక్షస హృదయమనే చెప్పవచ్చును. మనము చూచుటకు మానవులవలె వుంటుండి మన ప్రవర్తన రాక్షస ప్రవర్తనగా వుంటూవుంటే యింక దైవత్వము ఏరీతిగా మనకు ప్రాప్తిస్తుంది? ఈనాడు ప్రపంచములో మానవత్వమనేది యెక్కడాకూడను కన్పించటము లేదు. అనేకమంది సాధకులంతాకూడను 'భగవంతుని అన్వేషిస్తున్నాము, భగవంతుని వెదుకుతున్నాము', అని అంటున్నారు. సర్వత్రావున్న భగవంతుని వెతకటము ఎందుకు? ఎక్కడ వెదకటం? తాను భక్తుడుకాదు కనుకనే వెతుకుతున్నాడు. నిజమైన భక్తుడైతే భగవంతుని వెతుకనక్కరలేదు. సర్వత్రా తానే వుంటున్నాడు. ఈనాడు భగవంతుని భక్తుడు వెతకటంలేదు, భక్తులనే భగవంతుడు వెతుకుతున్నాడు. ఎక్కడ సరైన భక్తుడున్నాడా అని వెతుకుతున్నాడు. ఈ వెతకటం ఎందుకంటే ఎక్కడ చూచినా సరైన భక్తుడు లేదు కనుకనే! ఈనాటి మన భక్తి అంతా రివర్సు. భక్తుడు భగవంతుని వెతకటముపోయి భగవంతుడే భక్తులను వెతుకుతున్నాడీనాడు. కనుక భగవంతుడు మనలను వెతకనివ్వకుండా మనమే భగవంతుని దక్కించుకొని, చిక్కించుకొనే వుపాయాన్ని సాధించాలి.

**మన హృదయము ఒక మ్యూజికల్ ఛైర్ కాదు**

కర్మాచరణద్వారా కాయమును సార్థకము చేసుకొని, కాలమును పవిత్రము

గావించుకొని, దివ్యత్వాన్ని అనుభవించి, పవిత్రతలో మనము లీనమైపోవాలి. మన హృదయము ఒక్కటే! ఇది ఒక మ్యూజికల్ ఛైర్ కాదు. ఒకతూరి ఒక్కరు, మరొకతూరి మరొకరు, మరొకతూరి మరొకరిని యీ హృదయములో చేర్చుకోటానికి ప్రయత్నించకూడదు. నిజమైన భక్తునికి వుండవలసిన లక్షణాన్ని మనము గుర్తించుకోటానికి ప్రయత్నించాలి. కష్టములకు, నష్టములకు, దుఃఖమునకు, విచారములకు, నిందలకు, నిష్ఠూరములకు అన్ని కాలములందుకూడను ఒకే సమత్వాన్ని మనము పాటించాలి. పదిమంది పొగిడితే మనము ఏభై పౌండ్లు వుండే వాళ్లము నూరుపౌండ్లుగా పెరిగిపోతాము. ఎవరైనా దూషిస్తే లేక విమర్శిస్తే మనము కృంగిపోతాము. ఈ కృంగిపొంగనటువంటి భక్తి మనము సాధించాలి. 'కృంగటము ఒక బలహీనత; పొంగిపోవటం అహంకారము'. ఈ రెండింటికి మనము స్థానము యివ్వకూడదు.

**పట్టినదేదియో పట్టనే పట్టితివి**
**పట్టునెగ్గెదుదాక అట్టెయుండు**
**కోరినదేదియో కోరనే కోరితివి**
**కోర్కెచెల్లెదుదాక కొలిచియుండు**
**అడిగిన దేదియో అడగనే అడిగితివి**
**అడిగినదిడుదాక విడువకుండు**
**తలచినదేదియో తలచనే తలచితివి**
**తలపుతీరెడుదాక తరలకుండు**
**పోరు పడలేక తానైన బ్రోవవలయు**
**ఒడలు తెలియక నీవైన అడుగవలయు**
**అంతియేకాని మధ్యలో ఆపివేసి**
**తిరిగిపోవుట భక్తుని దీక్షకాదు**

అన్నారు. ఇవి భక్తునియొక్క లక్షణాలు. ఇట్టి లక్షణాలను మనము అభివృద్ధి పరచుకొని మనయందు చేరిన అవలక్షణములు దూరముచేసి యీ నిత్యానందమును,

srisathyasaivachanamrutam

బ్రహ్మానందమును, ఆత్మానందమును అనుభవించి దేశమునందు తగిన ఆదర్శమును అందించాలని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 7-10-1986న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam